# జలదుర్గం రమేష్‌లాంటి మానవ మృగాలపై

# నాయకులకు, పోలీసులకు ఎందుకు ఇంత ప్రేమ?

ఉపన్యాసం ఇమ్మంటే అందరూ స్త్రీజనోద్ధారకులే. దగ్గరి నుంచి చూసినప్పుడే నిస్సహాయులైన స్త్రీలను అణచివేయడంలో ఒక్కొక్కరి పాత్ర – పోలీసులు, రాజకీయ నాయకులు, పెద్దమనుషులు, చివరికి కోర్టులు కూడా – ఏమిటో అర్థం అవుతుంది.

భర్త అని పిలవబడే మృగం చేత ఒళ్ళంతా వాతలు పెట్టించుకున్న జలదుర్గం చంద్రకళకు కనీసం చట్టం, సమాజం తన పక్షాన ఉన్నాయన్న సంతృప్తయినా మిగలని వైనం చూస్తే ఈ సత్యం అర్థం అవుతుంది.

తొమ్మిదేండ్ల కింద రెండు లక్షల రూపాయలు, 25 తులాల బంగారం కట్నంగా తీసుకొని చంద్రకళను పెళ్ళి చేసుకున్న రమేష్ ఆ కట్నం చాలక అదనపు కట్నంకోసం ఆమెను హింసించ సాగాడు. అతని తల్లి మీనాక్షమ్మ, చెల్లెలు మాధవి, లతలు అతనికి తోడయ్యారు. వాళ్ళు పెట్టిన మానసిక హింసకు, కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఇద్దరు పిల్లలను తీసుకొని రైలు కిందపడే ఉద్దేశంతో చంద్రకళ 2003 సంవత్సరం అక్టోబర్ 12వ తేదీన ప్రొద్దుటూరు నుంచి యర్రగుంట్లకు పోయింది. తెలిసిన వాళ్ళు ఆమెను గుర్తుపట్టి ఆపకపోతే ఆ రోజే చనిపోయేది. అయితే అప్పుడు ఆమె ఇచ్చిన ఫిర్యాదును ప్రొద్దుటూరు ఒన్ టౌన్ పోలీసులు నేరారోపణగా పరిగణించి విచారించే బదులు పెద్దమనుషుల ముందుపెట్టి భార్యా భర్తలిద్దరినీ పిలిచి 'ఇక మీదట' బాగా చూసుకుంటానని అతని చేత అనిపించి మూసేశారు. (అరెస్టు తప్పించుకోవడానికి ఆ మాత్రం హామీ ఇవ్వడం అతనికేం కష్టం? జేబు దొంగలకు, నాటుసారా వ్యాపారులకు కూడా ఇదే పద్ధతి వర్తింపచేస్తే నేర ప్రపంచం ఎంత హాయిగా ఉండేది!)

ఆరు నెలలు తిరగక ముందే రమేష్, అతని తల్లీ తోబుట్టువులు చంద్రకళను క్రూరంగా హింసించడం మొదలుపెట్టారు. పోయిన దసరాకు రమేష్ కోరిన డబ్బు చంద్రకళ పుట్టింటి నుంచి తీసుకు రాలేదని ఎడమ తొడమీద పొంగనాల కడ్డీతో వాతలు పెట్టారు. పంచాయతీలు, కేసుల వల్ల పొందిన ఫలితం కళ్ళారా చూసిన చంద్రకళ మళ్ళీ కేసు గురించిగానీ, పంచాయతీ గురించి గానీ ఆలోచించలేదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి ఈ హింసాకాండ పరాకాష్ఠకు చేరుకుంది. వారు ఆమెను ఒక గదిలో బంధించి నోట్లో గుడ్డలు కుక్కి కాలిన ఇనుప కడ్డీతో వాతలు పెట్టారు. రమేష్ ఆమె గొంతు నులిమి అదనపు కట్నం తెస్తావా చస్తావా అని బెదిరించాడు. చివరికి ఆమె తన ప్రాణం కాపాడుకోవడానికి కాళ్ళావేళ్ళాపడి మా అమ్మా నాన్నలను అడుక్కొని డబ్బు తెస్తానని చెప్పి ప్రాణం దక్కించుకుంది.

గాయాలు కనపడకూడదని చెప్పి చంద్రకళను ఆ మృగాలు నాలుగు రోజులు నిర్బంధంలోనే ఉంచారు. 15వ తేదీన తన పుట్టింటికి పోనిచ్చారు. అయితే ఆమె పోలీసు ఫిర్యాదు ఇవ్వగలదని అనుకున్నాడేమో రమేష్ అదేరోజు ఆమె మీద, ఆమె తల్లిదండ్రులు, అన్నల మీద ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఒక సినిమా కథ వంటి ఫిర్యాదు ఇచ్చాడు. వాళ్ళంతా కలిసి తన

కళ్ళెదుటే తన బెడ్ రూంలోకి ప్రవేశించి డబ్బు, బంగారం, బాండ్లు దోచుకొని సంచిలో వేసి తీసుకుపోయారని దీని సారాంశం. ఇంగితం ఉన్న వాళ్ళెవరికైనా ఈ ఫిర్యాదు వెనుక ఏదో కథ ఉందని తెలిసి ఉండాలి. చట్టం ఆవగింజంత తెలిసినా, భార్య తన భర్త వస్తువులు అతని ఇష్టానికి వ్యతిరేకంగా తీసుకున్నా సరే అది దొంగతనం కిందికి రాదని తెలిసి ఉండాలి. అయినప్పటికీ ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ సి.ఐ వెంకటరమణ గారు అప్పటికే ఆర్‌టి పిపికి చేరిన చంద్రకళకూ, ఆమె పుట్టింటి వారికీ వెంటనే ఫోన్‌చేసి రమేష్ మీ అందరిపైనా దొంగతనం కేసు పెట్టాడనీ చంద్రకళ తండ్రి వెనువెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి కలవవల సిందని ఆదేశించాడు.

నిజమైన ఫిర్యాదులు విచారించడానికి ఈ అధికారి ఎంత ఆతురత చూపుతాడో గానీ చదవగానే అబద్ధం అని అర్థమయ్యే ఫిర్యాదును విచారించడానికి మాత్రం చాలా తొందర ప్రదర్శించాడు. రమేష్ ఫిర్యాదు పైన ఎఫ్ఐఆర్ సైతం నమోదు చేయకుండా చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు పిలిపించాడంటే రమేష్ ద్వారా సిఐ గారికి అప్పటికే అసలు కథ తెలిసిందనీ, రమేష్ ఫిర్యాదును చంద్రకళ ఇవ్వగల కంప్లయింట్‌కు కౌంటర్ కేసుగా గుర్తించాడనీ, అసలు కేసు నమోదు కాకుండా ఒత్తిడి చేయడం కోసం చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు పిలిపించాడనీ వ్యాఖ్యానిస్తే కుటుంబ హింస విషయంలో పోలీసులు అనుస రిస్తున్న పనితీరుకు భిన్నమైన వ్యాఖ్య అవుతుందా?



పుండు మీద కారంలాగా ఈ బెదిరింపు మీదపడ్డ చంద్రకళ అదేరోజు సాయంకాలం కల్లమల్ల పోలీసుస్టేషన్ వెళ్ళగా వారు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలిన గాయాల చికిత్సకోసం ప్రొద్దుటూరు సివిల్ ఆస్పత్రికి పంపారు. ఆస్పత్రి వారు పోలీసులను పిలి పించగా, ఆమె వివరమైన ఫిర్యాదు ఇచ్చింది. హత్యా ప్రయత్నం (సెక్షన్ 307), డబ్బు రాబట్టటం కోసం తీవ్రంగా హింసించడం (సెక్షన్ 329) అనే నేరాలు ఆమె ఫిర్యాదులో స్పష్టంగా కనిపిస్తున్నా సి.ఐ గారు కేవలం ఉద్దేశ పూర్వకంగా గాయపరచడం (సెక్షన్ 324), వరకట్నం వేధింపు (సెక్షన్ 498-ఎ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వాటికి శిక్ష 10 సంవత్సరాల నుంచి జీవిత ఖైదు దాకా ఉండగా వీటికి శిక్ష మూడేండ్లు మాత్రమే.

కాగా, రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మీద వెనువెంటనే ఆర్‌టిపిపికి ఫోన్‌చేసి చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు రమ్మని హుకుం జారీచేసిన సి.ఐ గారు, చంద్రకళ ఫిర్యాదును మాత్రం భద్రంగా దాచుకొని కూర్చున్నాడు. ప్రొద్దుటూరులోని 'పెద్దమనుషుల'నందరినీ కలిసి తనకు మద్దతు కూడగట్టుకోవడానికి రమేష్‌కు కావలసిన వెసులుబాటు ఉద్దేశ పూర్వకంగా కల్పించాడు. మేము 20వ తేదీన ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టిన తరువాత, 21వ తేదీన హుటా హుటిన బయలుదేరి రమేష్‌ను (వేరే ఎక్కడో కాదు, అతని ఇంటి వద్దనే) అరెస్టు చేసినట్టు రిమాండ్ రిపోర్టులో చెప్పుకుంటూ కోర్టులో హాజరుపెట్టాడు. జిల్లా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెల్ చైర్‌పర్సన్ అయిన పద్మావతమ్మ గారు కూడా 21వ తేదీన జిల్లా ఎస్.పి దృష్టికి విషయాన్ని తీసుకుపోయిన తరువాత, చంద్రకళ ఫిర్యాదులోనే స్పష్టంగా ఉన్న హత్యా ప్రయత్నం సెక్షన్‌ను ఆరోపణలలో చేరుస్తున్నట్టు సిఐ 23వ తేదీన తీరికగా కోర్టుకు తెలియ జేశారు.

అయినప్పటికీ తొలుత ఎఫ్ఐఆర్‌లో చిన్న సెక్షన్లు చూపించిన ఫలితం రమేష్‌కు దక్కింది. సి.ఐ ఉద్దేశం నెరవేరింది. రమేష్‌కు వెంటనే బెయిల్ లభించింది. ఇక్కడ కోర్టు వైఖరి గురించి కూడా ప్రస్తావించక తప్పదు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఏ సెక్షన్లు సూచిస్తారనేది కోర్టుకు ప్రమాణం కాదు. ఫిర్యాదులో ఏముందనేది ప్రమాణం. చంద్రకళ ఫిర్యాదులో సెక్షన్ 307, 329 (ఇంకా సెక్షన్లు 343, 348) నేరాలు స్పష్టంగా ఉన్నాయి. ముద్దాయికి బెయిల్ ఇచ్చే ముందు నేరం తీవ్రతను, అతన్ని వెంటనే బెయిల్ పైన విడుదల చేస్తే బాధితుల మనోస్థైర్యం పైన పడగల ప్రభావాన్ని, ముద్దాయి తిరిగి నేరం చేయగల అవకాశాన్ని లెక్కలోకి తీసుకోవాలని న్యాయశాస్త్రం చెపుతుంది. పోలీసులు ఇంకా ఇన్వెస్టిగేషన్ ఏమీచేయలేదన్న కారణంగా క్రూరమైన నేరానికి పాల్పడ్డ వ్యక్తికి బెయిల్ ఇవ్వడం తగదు. భర్త భార్య ఒళ్ళు కాల్చడం తీవ్రమైన నేరం కిందికి రాదని పోలీసులు పెద్దమనుషులు భావిస్తున్నట్టు కోర్టులు కూడా భావిస్తున్నాయని ప్రజలు అనుకొనే పరిస్థితి వస్తే న్యాయవ్యవస్థ పైన గౌరవం మిగులుతుందా?

ఆ తరువాత చంద్రకళ, ఆమె అన్న ప్రొద్దుటూరు ఎంఎల్ఏ వరదరాజులరెడ్డి గారి దగ్గరికి పోయి తమకు జరిగిన అన్యాయం గురించి చెప్పి న్యాయం జరిగేటట్టు చూడమని కోరారు. ప్రజా ప్రతినిధిగా వారికి బాధ్యత ఏమైనా ఉంటే సి.ఐకి ఫోన్‌చేసి కేసు నిర్లక్ష్యం చేసినందుకు మందలించి ఉండవలసింది. వెంటనే నేర పరిశోధన చేపట్టి ఛార్జిషీటు దాఖలుచేయమని చెప్పవలసి ఉండింది. వారి ప్రయోజనాలు దెబ్బతిని ఉంటే ఈ పనే చేసి ఉందురు. కానీ చంద్రకళ విషయంలో అదేమి చేయకుండా "చేయదలచుకుంటే సంసారం చేయి, లేకపోతే విడాకులు తీసుకో" అని సలహా ఇచ్చి పంచాయతీ కావాలంటే చేస్తామని అన్నాడు. పంచాయతీ చేయడానికి ఇదేమైనా పొలంగట్టు తగాదానా, ప్రహరీ గోడ తగాదానా? కట్నం తీసుకోవడమే నేరమైతే పెళ్ళప్పుడు తీసుకోవడమేగాక ఇంకా తెమ్మని ఒళ్ళంతా ఇనుప కడ్డీతో కాల్చిన వాడితో ఏం రాజీ పడుతుంది? సగం డబ్బు తెచ్చిస్తాను. ఈసారీ సగం ఒళ్ళు మాత్రమే కాల్చమని అడుగుతుందా? ఈ నాయకుల, పోలీసు అధికారుల పిల్లలకే ఈ విధంగా జరిగితే ఇదే విధంగా స్పందిస్తారా?

పంచాయతీకి అర్థమేమిటో ఎంఎల్ఏ అనుచరుడు, డీసిసిబి ఉపాధ్యక్షుడు ఓబయ్య గారు స్పష్టం చేశారు. రమేష్ ఆస్తులు చంద్రకళ ఆమె కుటుంబ సభ్యులు దొంగిలించారనీ, ఆమె తన ఒంటిని కాల్చుకుందనీ, ఆమెకు వేరే ఎవరితోనో సంబంధం ఉందనీ అంటూ ఈ ప్రశ్నలకు ముందు జవాబు చెప్పమని కబురు పంపాడు. ఈ నీచత్వానికి పెద్దమనిషి హోదా, నాయకత్వపు హోదా కల్పించి దీనిని భరిస్తున్న సమాజాన్ని తిట్టుకోవాలా, తమ వారి ప్రయోజనాలు కాపాడటానికి ఎంతటి నీచానికైనా దిగజారగల ఈ నాయకుల నైజాన్ని అసహ్యించుకోవాలా అనేది నిర్ణయించటం కష్టం.

చంద్రకళ ఉదంతం ప్రొద్దుటూరు వాసులకు కొత్తకాదు. కట్నం కోసమో, అనుమానం ఉందనో, మొగుడికి రెండో పెళ్ళి చేసుకోవాలన్న కోరిక కలిగిందనో హింసకు గురైన స్త్రీ పోలీసు స్టేషన్‌కు పోతే అక్కడ నిర్లక్ష్యం, లంచగొండితనం, నాయకుల దగ్గరికి పోతే సంసారం చేసుకోమన్న నీతిబోధ, పంచాయతీలని, రాజీలని ఒత్తిళ్ళు, ఆమెదే ఏదో తప్పుందన్న వక్రవ్యాఖ్యలు, సమాజం ఉదాశీనత – ఎన్ని కథలు చూడలేదు? చివరికి నిస్సహాయంగా రాజీపడటమో, తన ప్రాణం తానే

తీసుకోవడమో తప్ప గత్యంతరం ఉండటం లేదు. మళ్ళీ ఎవరిని కదలించినా స్త్రీ జనోద్ధరణ గురించి ఉపన్యాసాలు దంచేవారే.

ఎవరూ ఎవరినీ ఉద్ధరించనక్కర లేదు. అన్యాయానికి గురైన వారికి చట్టం అండగా నిలబడాలి, సమాజం అండగా నిలబడాలి. వారి హక్కులు సాధించుకోవటానికి, నిలబెట్టు కోవడానికి సహాయపడాలి. అవమానానికి గురైన వారికి ఆత్మస్థయిర్యం కలిగించాలి. కుటుంబం లోపలహింసకు గురయ్యే స్త్రీలపట్ల అధికార యంత్రాంగానికి న్యాయ వ్యవస్థకు, రాజకీయ వ్యవస్థకు అన్నిటినీ మించి సమాజానికి ఉన్న బాధ్యత ఇది. ఈ నాగరికత మనం ఎప్పుడు అలవరచుకుంటాం?

ఇప్పటికైనా చంద్రకళకు న్యాయంచేసి మానవత్వం నిండిన మనుషులనిపించు కుంటారో లేక రమేష్ లాంటి మానవ మృగాలకు మద్దతుదారులుగా చరిత్రలో మిగిలి పోతారో మన నాయకులు, పోలీసులు తేల్చుకోవాల్సి ఉంది.

**కడప జిల్లా కమిటీ**